ప్రజాశక్తి
బుధవారం 20 మార్చి 2024 5 విజయనగరం



ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని జొన్నాడ సమీపంలోని భూమాతా లేఔట్ లో చెట్టుకు ఉరివేసుకొని ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా నందిగామ గ్రామానికి చెందిన షేక్ లాల్ ముజఫర్ (21) రఘు ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ నాలుగో సంవత్సరం పూర్తి చేశాడు. అందులో కొన్ని సబ్జెక్టులు ఉండిపోవడంతో స్వగ్రామం నుంచి పది రోజుల క్రితం విశాఖపట్నం బోయపాలెం దగ్గర ఉంటున్న తన స్నేహితుడు రూమ్‌కు వచ్చాడు. సోమవారం సాయంత్రం తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడాడు. తండ్రి మందలించడంతో అదే రోజు రాత్రి తండ్రికి వాట్సాప్ కాల్ చేసి తాను ఉరివేసుకుని చనిపోతున్నాను చెప్పాడు. ఇంతలోనే మంగళవారం ఉదయం భూమాతా లే అవుట్‌లో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇక్కడికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి రోధించారు. ఎస్ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు

జనసేనకు టిడిపి సహాయ నిరాకరణ

- నెల్లిమర్ల నియోజకవర్గంలో దుస్థితి
- మౌనం వీడని బంగార్రాజు
- పొత్తులతో పార్టీ ఉనికి పోతుందంటూ తెలుగు తమ్ముళ్ల ఆవేదన





ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థికి టిడిపి నుంచి సహాయ నిరాకరణ కనిపిస్తోంది. జనసేన పార్టీ తరపున లోకం మాధవిని ప్రకటించి సరిగ్గా నెలరోజులు కావస్తోంది. ఇప్పటి వరకు ఆమె వెంట తెలుగు దేశం పార్టీ నాయకులు గానీ, క్రియాశీలక కార్యకర్తలు గానీ వెళ్లలేదు. మరోవైపు ఈ సీటు టిడిపికి మాత్రమే కేటాయించాలని కొందరు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుకు మాత్రమే కేటాయించాలని మరికొందరు ప్రకటనలు చేశారు. నాలుగు మండలాలకు చెందిన కీలక నాయకులు ఏకంగా టిడిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడ్ని నేరుగా కలిసి బంగార్రాజుకు న్యాయం చేయాలని కోరారు. ఇటువంటి పరిస్థితుల్లో విజయనగరం పార్లమెంట్ స్థానం పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించినట్టు వార్తలు వెలువడడంతో ఈ నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లంతా అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. ఎమ్మెల్యేకు కాకపోతే ఎంపీ స్థానానికైనా తమ పార్టీ తరపు అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓటు వేసుకోవచ్చని భావించామని, ఈ రెండు సీట్లూ జనసేన, టిడిపికి కేటాయించడం వల్ల నియోజకవర్గంలో ఏకంగా సైకిల్ గుర్తే కనిపించే పరిస్థితి లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ, లేదా ఎమ్మెల్యే సీటు టిడిపికి ఇవ్వకపోతే నెల్లిమర్ల అసెంబ్లీ స్థానంలో టిడిపి ఉనికి కోల్పోయే ప్రమాదం కూడా ఉందని చెప్తున్నారు. ఇలా టిడిపి నాయకులు, కేడర్ సహాయ నిరాకరణ, వ్యతిరేకత ప్రదర్శిస్తుండడంతో మాధవి యూటర్న్ తీసుకుని వైసిపిలోని కొంతమందిని ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగానే భోగాపురం మండలానికి చెందిన కాకర్లపూడి శ్రీనివాసరాజు వైసిపికి రాజీనామా చేసినట్టు సమాచారం. అందుకు తగ్గట్టే ఆయన క్యాంపు కార్యాలయంలోనే ఆయన అభిమానులు ఇటీవల జనసేనలో చేరారు. వ్యవహారం ముదురపాకాన పడుతున్నప్పటికీ టిడిపి, జనసేన రాష్ట్ర పార్టీ నేతలు పట్టించు కోకపోవడం అటు జనసేన, ఇటు టిడిపి కేడర్‌లో గందరగోళ పరిస్థితి నెలకుంది. పూసపాటిరేగ మండలంలో కూడా పలువురు వైసిపి సర్పంచులు జనసేనలో చేరేందుకు రంగం సిద్ధమవుతోంది. మరోవైపు బంగార్రాజు కూడా మౌనం వీడడం లేదు. కొద్దిరోజులపాటు స్తబ్ధతగా ఉండాలని పార్టీ కేడర్‌ను కోరారట. భవిష్యత్తుకు భరోసా ఇచ్చేవరకు మౌనం వీడే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈలోపు ప్రత్యర్థి ప్రచారం, వ్యతిరేక నినాదంతో జనసేన అభ్యర్థి లోలోపల ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు భీమిలి నియోజకవర్గం అభ్యర్థికి టిడిపి అధిష్టానం పరిశీలిస్తున్న పేర్లలో బంగార్రాజు పేరు కూడా ఉందని ప్రచారం నడుస్తోంది. టిడిపిలో మిగిలిన సీట్ల భర్తీకి అభ్యర్థులను ఖరారు చేస్తే తప్ప నెల్లిమర్లలో పరిస్థితులు చక్కబడే పరిస్థితులు కనిపించడం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జనసేనలోకి వలసలు... టిడిపిలో గుబులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నెల్లిమర్ల నియోజకవ్గరం జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నాయకులు లోకం మాధవిని ప్రకటించడంతో వైసిపి నుంచి ఆ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. దీంతో టిడిపి నాయకుల్లో ఆందోళన మొదలైంది. టిడిపిలో చేరాల్సిన వారంతా జనసేన అభ్యర్థి మాధవి అధ్వర్యంలో జనసేన కండువా కప్పుకోవడంతో వారికి కంటిమీద కునుకు ఉండడం లేదు. టిడిపికి సంబంధం లేకుండా వలసలు జరిగిపోవడంతో ఆ పార్టీ నాయకులు అంతర్మథనంలో పడ్డారు. స్థానికంగా మన ప్రమేయం లేకుండా జనసేన పార్టీలోకి వెళ్లిన వారిని అడ్డుకోవాలని కొంత మంది కార్యకర్తలు టిడిపి నాయకుల వద్ద ఏకరువుపెట్టారు. స్పందించిన నాయకులు 90శాతం ఉన్న మనం చెప్పిందే 10 శాతం ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలు వినేలా రూల్ పెడదామని ఇటీవల జరిగిన సమావేశంలో కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ విషయం త్వరలో ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి వద్ద పెడదామను కున్నారు. కానీ మాధవి అధ్వర్యంలో జనసేనలోకి అడపా తడపా వలసలు జరుగుతున్నాయి.

పూసపాటిరేగ మండలంలోని కుమిలి పిఎసిఎస్ చైర్మన్ పతివాడ శ్రీను, చల్లవానితోట సర్పంచి పతివాడ వరలక్ష్మి లోకం మాధవి అధ్వర్యంలో బుధవారం జనసేనలో చేరనున్నారు. వారితో పాటు మరి కొన్ని పంచాయతీల సర్పంచులు చేరే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు విస్మయం చెందుతున్నారు. ఇలా గ్రామాల సర్పంచులు జనసేనలో చేరితో టిడిపి కంటే జనసేనదే పై చేయి అవుతుందని ఆవేదన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఈ సమస్య ఉంటే పరిస్థితి ఏమిటని తలలు పట్టుకుంటున్నారు. పొత్తు తమను చిత్తు చేసేలా ఉందని నాయకుల వద్ద మొరపెడుతున్నారు. ఈ విషయమై నాలుగు మండలాల టిడిపి నాయకులు సమావేశమైనట్లు తెలిసింది. ఈ పరిణామాలు భవిష్యత్తులో ఎటు దారి తీస్తాయో వేచి చూడాల్సిందే.





భారీ వర్షానికి చీపురుపల్లిలో కూలిన విద్యుత్తు అలంకరణ స్తంభాలు; గాలులకు కూలిన విద్యుత్తు స్తంభం

పలుచోట్ల భారీ వర్షం

- చీపురుపల్లిలో కూలిన విద్యుత్ అలంకరణ స్తంభాలు
- నష్టపోయిన చిరు వ్యాపారులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. చీపురుపల్లిలో సుమారు గంటన్నరపాటు ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కురుస్తున్న వర్షాన్ని చూసిన ప్రజలు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఒక పక్క కనకమహాలక్ష్మి జాతరకు వచ్చిన బంధువులు, మరొక పక్క భారీ వర్షం కారణంగా జలమయంమైన రోడ్లతో ఇబ్బంది పడ్డారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు భారీ విద్యుత్ అలంకరణ స్తంభాలు గాలులతో కూడిన వర్షం పడడడంతో నేలకొరిగాయి. చీపురుపల్లి లావేరు రోడ్డులో ఉన్న వీధి దీపాల ఐరన్ స్థంభం కూలిపోయింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చీపురుపల్లి అంబేద్కర్ విగ్రహం, గెడ్డమిల్లు , అమ్మవారి ఆర్చి వద్ద కర్రలతో ఏర్పాటు చేసిన విద్యుత్తు లైటింగ్స్ కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.జాతర సందర్భంగా రోడ్లపై ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న షాపులు చిందరవందర అయ్యాయి. అలాగే సుదూర ప్రాంతాల నుండి జాతరలో చిన్న వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలు వర్షం కారణంగా తడిసి ముద్దయ్యాయి. జాతరలో ఏర్పాటు చేసి వినోద కార్యక్రమాలకు సంబంధించిన మిషనరీ అంతా కూడా తడిసిపోవడంతో ఎక్కడికక్కడ ఈవెంట్స్ అన్ని ఆగిపోయాయి. దీంతో లక్షలాది రూపాయలను వ్యాపారస్తులు నష్టపోయారు. జాతర చివరి రోజున సుమారు రెండు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావలసి ఉండగా వర్షం కారణంగా భక్తుల రాకకు అంతరాయం ఏర్పడింది. చీపురుపల్లి నుండి అమ్మవారి ఆలయం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పునరుద్దరణ పనులు చేపట్టారు.



బొబ్బిలిలో కురుస్తున్న వర్షం

బొబ్బిలి : బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, బొండపల్లి, మెరకముడిదాంలో కురిసిన వర్షంతో ప్రజలు ఉక్కపోత నుంచి సేద తీరారు. మెరకముడిదాం, గజపతినగరం మండలాల్లో గంటకు పైగా వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి.

కోలగట్ల అవినీతిని ఆధారాలతో చూపిస్తాం

ముడుపులిస్తేనే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు
అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ గౌరీశంకర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక ఎమ్మెల్యే రాజకీయ లీలలు టీవీ సీరియల్స్ మాదిరిగా కథలు కథలుగా, ఎపిసోడ్లు మాదిరిగా ఎన్నో చెప్పుకోవచ్చని అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ విమర్శించారు. తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది భూములను కబ్జా చేస్తే స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల ఏకంగా విజయనగరం కార్పొరేషన్, మండల కార్యాలయాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. నగరంలో ఒక చిన్న ఇల్లు, గ్రూప్ హౌస్ లేదా అపార్టుమెంట్ కట్టాలన్న ముందుగా స్వామివారి దర్శనం చేసుకోవాలని, లేదంటే అనుమతులు లభించవని పేర్కొన్నారు. నగరంలో ఏ నిర్మాణం చేపట్టిన అధికారులు నేరుగా అక్కడికి వచ్చి అడ్డుకుంటారని, తమకు అన్ని అనుమతులూ ఉన్నాయి అన్నప్పటికీ, ఆ అధికారులు మాత్రం స్వామి వారిని కలిసిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని చెబుతుంటారనిన అన్నారు. లే అవుట్ల కోసం ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు కావాలంటే స్వామి వారి దర్శనం చేసుకుని, అక్కడ ఉండే కౌంటర్-1,2 లను కలిస్తే వారు చెప్పినట్లు ఆ స్వామివారి చిట్స్ కంపెనీలో 50 నుంచి కోటి రూపాయలు చిట్స్ కడితే ఇల్లు, గ్రూప్ హౌస్ లేదా అపార్టుమెంట్ల నిర్మాణాలకు అనుమతులు నిరాటంకంగా లభిస్తాయని వివరించారు. లేఅవుట్ల కోసం ల్యాండ్ కన్వర్షన్ కావాలంటే ఆయన అల్లుడికి షేర్ ఇవ్వకపోతే అనుమతులు లభించవని పేర్కొన్నారు. విజయనగరంలో ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితులు తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నగర సుందరీ కరణ పనులు ఏ నిధులతో చేపట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో గంటస్తంభం నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు రోడ్ల అభివృద్ధి కోసం దుకాణాలను తొలగించేందుకు వెళ్తే బాధితులంతా నష్టపరిహారం ఇప్పించాలని అడిగితే వ్యాపారస్తులు బెదిరించి దౌర్జన్యంగా రోడ్లు వేశారని తెలిపారు. ఆయన రాజకీయలీలను కూడా తొందరలోనే బయటపెడతానని హెచ్చరించారు.

టెన్త్ పరీక్షకు 443 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండో రోజు మంగళవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 443 మంది గైర్హాజరయ్యారు. 129 కేంద్రాల్లో 24333 మంది హాజరు కావాల్సి ఉండగా 23890 మంది హాజరయ్యారు. మొత్తం స్కాడ్ బృందాలు 64 కేంద్రాలు, డిఇఒ పది కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష జరిగిందని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఎండియు కాటాలకు సీలు తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం బొండపల్లి మండలంలోని బోడసింగిపేట, బొండపల్లి కేంద్రాల్లో ఎండియు, రేషన్‌డిపోల్లో తూనిక కాటాలను తనిఖీ చేశారు. తూనిక యంత్రాలను సరిచూసి సీళ్లు వేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లా లో ప్రజా పంపిణీ కు వినియోగించు ప్రతీ తూనిక యంత్రాలు ధ్రువీకరణ పత్రాలు, సీళ్ళు తప్పనిసరిగా కలిగి ఉండాలని, తూకం ఖచ్చితంగా ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎ సత్యనారాయణ, మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

జాతరకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

కనకమహలక్ష్మి జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించు కునేందుకు మంగళవారం ఉదయం నుండి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తులు తాకిడి ఎక్కువైంది. క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ సూరు కుమార్, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్ర పటాన్ని నాగార్జునకి అందజేసారు. నాగార్జున వెంట టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, రెడ్డి లక్ష్మణ, పైల బలరాం, సారిపాక సురేష్ తదితరులు ఉన్నారు.

రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

జెఎన్‌టియుజివి, లెండి కళాశాలలు గుర్తింపు ● ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్.పి. పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో జరిగే సాధారణ, అసెంబ్లీ ఎన్నికల కోసం రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. నగరంలోని జెఎన్‌టియు - గురజాడ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోనూ, జొన్నాడలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలోను ఓట్లలెక్కింపు చేపట్టాలని నిర్ణయించామని, ఈ మేరకు ఆయా కేంద్రాల్లో ఏర్పాట్ల కోసం పరిశీలన చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, రెవిన్యూ, పోలీసు అధికారులతో కలసి మంగళవారం ఓట్లలెక్కింపు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశాల సందర్భంగా వారితో చర్చించిన మీదట సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అనంతరం ఇవిఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, ఓట్లలెక్కింపు జెఎన్‌టియు, లెండి కళాశాలల్లో నిర్వహించాలని నిర్ణయానికి వచ్చామన్నారు. ఈ సందర్భంగా జెఎన్‌టియులో విజయనగరం, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గాలకు, లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల ఇవిఎంల స్ట్రాంగ్‌రూంలు, ఓట్లలెక్కింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయా క్యాంపస్‌లలో అవసరమైన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, సి.సి.కెమెరాల ఏర్పాటు, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి వసతుల కల్పన తదితర అంశాలపై సూచనలు చేశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, ఆర్‌డిఒలు ఎం.వి.సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి, రిటర్నింగ్ అధికారులు నూకరాజు, జోసెఫ్, మురళీకృష్ణ, డిఎస్‌పి. గోవిందరావు, విజయనగరం తహశీల్దార్ రత్నం, పోలీసు అధికారులు, పలు మండలాల తహశీల్దార్‌లు పాల్గొన్నారు.



లెండి కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

15వేల పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగింపు

సినిమా థియేటర్లు, టివి ఛానళ్లు, కేబుల్ టీవీల్లో రాజకీయ పార్టీలు జారీ చేసే ప్రచార ప్రకటనలకు ఎంసిఎంసి నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఇంతకుముందే మొదలై, కొనసాగుతున్న ప్రకటనలకు సైతం తాజాగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఆమె ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 14,540 పోస్టర్లు, ఫెక్సీలు, బ్యానర్లను, 38 హోర్డింగులను తొలగించినట్లు తెలిపారు. 314 విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు. సి-విజిల్ ద్వారా గానీ, కాల్‌సెంటర్ లేదా ఇతరత్రా వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను విచారణ పేరుతో రోజుల తరబడి వేచి చూడకుండా, గంటల్లోనే వాటిపై చర్యలు తీసుకొని, నివేదికలను తమకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

పన్ను బకాయిదారులను ఉపేక్షించొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మాట్లాడుతున్న కమిషనర్ నాయుడు

దీర్ఘకాల కుళాయి పన్ను దారులను ఉపేక్షించవద్దని సిబ్బందికి, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు చెప్పారు. మంగళవారం సచివాలయాల వారీగా నగరపాలక సంస్థ కార్యాలయం నందు సమీక్ష నిర్వహించారు. అనేకచోట్ల కుళాయి పన్నులు బకాయిలు పడ్డాయని, ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదని చెప్పారు. ఎప్పటికప్పుడు పన్ను వసూళ్లను చేపడుతూ ఉండాలన్నారు. దీర్ఘకాల కుళాయి పన్నుదారుల కనెక్షన్లను తొలగించి వేయాలని ఆదేశించారు. పన్నులను త్వరితగతిన వసూలు చేసి నీటి నిర్వహణకు తోడ్పాటునందించాలని చెప్పారు. సమావేశంలో సహాయ కమిషనర్ తిరుమలరావు, ఇన్చార్జి ఇఇ దక్షిణామూర్తి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇటీవల విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద పిసిసి అధ్యక్షులు షర్మిలా ఆధ్వర్యాన జరిగిన సభ విజయవంతంతో కాంగ్రెస్‌కు త్వరలో పూర్వ వైభవం వస్తున్నట్లు రూఢీ అవుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సరగడ రమేష్ అన్నారు. సభను జయప్రదం చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కొత్తఊపు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజలలో ఆదరణ పెరుగుతోందన్నారు. పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా ప్రభావం చూపుతుందన్నారు. పూర్వ వైభవం వస్తుందన్నారు. మైనార్టీ సెల్ నాయకులు ఎండి షరీఫ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొణతాల రమాదేవి , సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నన్ను నమ్మితేనే ఓటేయండి

ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో మౌలిక వసతులు కల్పన, అభివృద్ధి తదితర విషయాలపై తనను నమ్మితేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని వైసిపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నానని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడం వలన నీటి ఎద్దడి లేకుండా ముషిడిపల్లి, చంపావతి తాగునీటి పథకాలపై రివ్యూ చేసి, ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఆంధ్ర ప్రాజెక్ట్ గేట్లు ఎత్తించి నీరు విడుదల చేయించడం జరిగిందనీ, నగరంలో ఐదేళ్లలో కార్పొరేషన్ స్థాయిలో సుందరీకరణ, అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. అశోక్ గజపతిరాజు తాగునీటి కష్టాలు తొలగించే పని ఎందుకు చెయ్యలేదని ప్రశ్నించారు. తాను నిత్యం ప్రజల్లోనే ఉంటున్నానని, నన్ను నమ్మితేనే ఓట్లు వేయాలని కోరారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఆయా క్లబ్ లు సభ్యులు,వ్యాపారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

మౌలిక వసతులకు నోచని కాలనీలు

మురికి కూపాల మధ్య నివాసాలు ● పట్టించుకోని పాలకులు



మౌలిక వసతులకు నోచని ఎల్‌బిజి నగర్ కాలనీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నానని, సుందరీకరణ చేపట్టామని చెబుతున్న వైసిపి పాలకులకు నగరంలోని శివారు కాలనీల సమస్యలు కానరావడం లేదు. మౌలిక వసతులు లేక ఏళ్ల తరబడి మురుగు కూపాల మధ్య ఆ పేదలంతా జీవనం సాగిస్తున్నా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. నగర ప్రజలందరికీ మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెబుతున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి శివారు కాలనీలను మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి ఎన్నికల సమయంలోను వాగ్దానాలు చేస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికలయ్యాక తెప్ప తగలేసిన వైనం వెల్లడవుతోంది.

విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఎల్‌బిజి నగర్‌లో 50 కుటుంబాల పేదలు నివాసముంటున్నారు. వీరంతా 18ఏళ్ల క్రితం ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకు మౌలిక వసతులు కల్పించాలని అనేక దఫాలుగా పోరాడి, జైలుకు వెళ్లి విద్యుత్, ఒక తాగునీటి బోరు సాధించుకున్నారు. ఇంటి పన్నులు వేయించుకున్నారు. తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్నా అప్పటి టిడిపి ప్రభుత్వం గాని, నేటి వైసిపి ప్రభుత్వంలోని ఎమ్మెల్యే గాని పట్టించుకోలేదు. నాలుగు వీధులుగా ఉన్న ఈ కాలనీలో నేటికీ రోడ్లు లేవు. వాడుక నీరు వెళ్లేందుకు కనీసం కాలువకు కూడా లేదు. దీంతో ఇళ్ల చుట్టూ మురుకు నీరు నిల్వ ఉండిపోయి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నేళ్లుగా తాటిపూడి నుంచి విజయనగరం వచ్చే తాగునీరు పైప్‌ల లీకేజీ నీటిపై ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నారు. తర్వాత సుదీర్ఘ పోరాటం చేయడంతో ఎమ్మెల్యే ఒక బోరు వేయించారు. రోజూ తప్పించి రోజు వచ్చే మున్సిపల్ వాటర్ టాంక్ నీరు నాలుగు బిందెలు పట్టుకొని రెండు రోజులు సరిపెట్టు కుంటున్నారు. వాడుకలకు ఈ నీరే ఆధారం. రోడ్లు, కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కాలనీ చుట్టూ తుప్పలు ఉండడంతో అప్పుడప్పుడు పాములు కూడా వచ్చేస్తున్నాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. పిల్లల చదువులకు నరవ, కలెక్టరేట్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదవాల్సిన పరిస్థితి. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వచ్చే నాయకులకు మా కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మురికి కూపం నుంచి కాపాడండి



అనేక ఏళ్లగా విష సర్పాల మధ్య జీవనం సాగిస్తున్నాం. రోడ్లు, కాలువలు లేక ఇళ్ల మధ్యే మురుగునీరు ఉండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పాలకులు ఎన్నికల సమయంలో వచ్చి సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి చేయి చూపిస్తున్నారు. రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలి.

\- కుప్పిలి కుమారి, ఎల్‌బిజి నగర్

ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోండి



18 ఏళ్లుగా ఇక్కడే జీవిస్తున్నాం. ఇన్నేళ్లయినా పాలకులు తమకు పట్టాలు మాత్రం ఇవ్వడం లేదు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో నాయకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. తమకు ఇళ్ళ పట్టాలు ఇచ్చి ఎవరు న్యాయం చేస్తే, వారికే అండగా ఉంటాం.

\- జి. పుణ్యవతి, ఎల్‌బిజి నగర్



మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు

'ఆ వార్తలను నమ్మొద్దు'

ప్రజాశక్తి - వేపాడ

ఈ మధ్య కాలంలో ఎస్‌కోట టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలితకుమారి అంటూ వస్తున్న వార్తలను ఎవరూ నమ్మి మోసపోవద్దని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. మండలంలోని బాణాదిలోని తన స్వగృహంలో మంగళవారం 29 పంచాయతీలకు సంబంధించిన టిడిపి నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుండి వేపాడ మండలం పార్టీకి కంచుకోటగా ఉండేదని గత ఎన్నికల్లో స్వయం కృతాపరాధం వల్లే ఓటమి చెందామని తెలిపారు. అటువంటి పరిణామం పునరావృతం కాకుండా ఉండేందుకు చంద్రబాబు గొంప కృష్ణను తీసుకొచ్చారన్నారు. ఈ నేపథ్యంలో గొంప కృష్ణ గ్రామాల్లో పర్యటించి ప్రజల కష్టాలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసి పలువురు మన్ననలు పొందుతున్నారన్నారు. అధిష్టానం గొంప కృష్ణకు కాకుండా వేరే వ్యక్తులకు టిక్కెట్టు ఇస్తే మనస్ఫూర్తిగా పనిచేయలేమని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మహిళా సంఘాల అవేర్నెస్ కమిటీ చైర్పర్సన్ గొంప తులసి, నాయకులు సేనాపతి గణేష్, ఈశ్వర్రావు, సిరికి రమణ, గుమ్మడి రవి, నాగరాజు, అప్పలసూరి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామచంద్రపేటలో ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని కొంగవాని పాలెం రెవెన్యూ రామచంద్రపేట సమీపంలో క్వారీ ఏర్పాటుపై అధికారులు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. మూడున్నర ఎకరాలు క్వారీ కోసం అనుమతులు కావాలని విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి అనిత హాజరు కానున్నారు. రామచంద్ర పేట గ్రామస్తులు మాత్రం గ్రామ సమీపంలో క్వారీ వద్దని చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న ఒక క్వారీతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు గ్రామానికి ఆనుకొని మరొకటి ఏర్పాటు చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన కరువు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుంపల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్పందన కరువైంది. పిహెచ్‌సిలో ఇస్తున్న మాత్రలనే తిరిగి వైద్య శిబిరం పెట్టి ఇవ్వడంతో ప్రత్యేకమైన వైద్యం ఏమీ అందడం లేదని ఎవరూ ముందుకు రాలేదు. గ్రామాల్లో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు పేరిట డాక్టర్లు గ్రామాల్లోకి వెళ్లిపోవడంతో పిహెచ్‌సిల్లో వైద్యం అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో వచ్చి వైద్యం అందించకపోయినా పర్వాలేదు కానీ పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉంటే మంచిదని చెబుతున్నారు. ఈ వైద్య శిబిరంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి కె.రాజు, వైద్య, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలువల్లో పేరుకుపోయిన చెత్త

కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి - బొబ్బిలి

మురుగునీటి కాలువలలో పూడికలు పేరుకుపోవడంతో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పాతబీధి, సంఘవీధి, చాకలివీధిలో పారిశుధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. మురుగునీటి కాలువలలో పూడికలు పేరుకుపోవడంతో పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలు ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామంలో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని గిరిజన గ్రామం రాచర్లలో మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇందిరమ్మ అభయం కింద రూ.5వేలు, రూ.500కే గ్యాస్ సరఫరా, 200యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా కల్వర్టు పనులు

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని సంకిలి సచివాలయ పరిధి చిన్నయ్యపేటలో మెయిన్ రోడ్డుకు సంబంధించి కల్వర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ సమస్య గుర్తించి రూ.5 లక్షలతో సిసి కల్వర్టు నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఈ పనులను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ మంగళవారం పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు, రామస్వామి పేట ప్రాథమిక పాఠశాలల వద్ద సాధారణ ఎన్నికలు నిమిత్తం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం వల్లంపూడి ఎస్‌ఐ కె.రాజేష్ పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - వేపాడ

రైతు భరోసా కేంద్రం ఏహెచ్ఎ లంతా రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎస్‌కోట ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.చలపతిరావు ఆదేశించారు. మంగళవారం నీలకంఠరాజపురం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కేంద్రానికి స్థానిక గోపాలమిత్ర బి సింహాద్రప్పుడు ఇప్పటి వరకు విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నూతనంగా ఎహెచ్ఎ నియామకం జరగడంతో బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా రికార్డులను, మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. కేంద్రంలో ఉన్న రికార్డులన్నీ ప్రతిరోజు సక్రమంగా నిర్వహించాలని విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బి సింహాచలం నాయుడు, గోపాలమిత్ర, నీలకంఠరాజపురం, కొమ్మల్లి ఎహెచ్ఎలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో దొంగతనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేట శ్మశాన వాటికలో మంగళవారం దొంగతనం జరిగింది. కొంత మంది శ్మశానంలో బీడుతో కూడిన దహన వాటికను ధ్వంసం చేసి పట్టుకెళ్ళిన సమయంలో ఎవరో కేకలు వేయడంతో దహన వాటిక శిథిలాలను అక్కడే వదిలి దుండగులు పలాయనం చిత్తగించారు.



దుండగులు ధ్వంసం చేసిన దహన వాటిక ఇదే..

కాగా ఇటీవల శ్మశానం అభివృద్ధి చేయడానికి దాతలు ముందుకు వచ్చి లక్షలాది రూపాయలతో ప్రహరీగోడ, దహన వాటిక ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దుండగులు బీడు దహన వాటిక లక్షల విలువ చేయడంతో దాని మీద కన్నేశారు. మంగళవారం ఉదయం దహన వాటికను ముక్కలు చేసి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పొలం పనులకు వెళ్ళే వారికి శబ్దాలు వినిపించడంతో పెద్ద కేకలు వేశారు. దీంతో దుండగులు వాటిని అక్కడే వదిలేసి పారిపోయారు. కాగా ఇంతకు ముందు దొంగ తనం చేయడం చూసి, గాని శ్మశాన వాటికలో దొంగతనం చేయడం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికలో దొంగతనం పై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.

సదరం సర్టిఫికెట్ల కోసం పాట్లు

● రోగుల పట్ల ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం ● ఐదుగంటలకుపైగా నిరీక్షించిన వికలాంగులు ● ఆస్పత్రిలోనే నిద్రపోయిన వైద్యుడు ● ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానంతో దాటవేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అంగవైకల్యంతో బాధపడే వారు సదరం సర్టిఫికెట్ల కోసం జిల్లా ఆసుపత్రి చుట్టూ తిరగకుండా స్థానిక ఏరియా ఆసుపత్రిలోనే సర్టిఫికెట్లు పొందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సదరం సర్టిఫికెట్ల జారీ కోసం వికలాంగులు అగచాట్లు పడుతున్నారు. అంగవైకల్య పరిశీలన కార్యక్రమం ఎస్ కోట ఏరియా ఆసుపత్రి ఓ డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఈ ఆసుపత్రికి వచ్చేవారు నరకాన్ని చవి చూస్తున్నామని వాపోతున్నారు. అంగవైకల్యం పరిశీలనకు వచ్చేవారు సచివాలయాలలో స్లాట్ బుక్ చేసుకునేటప్పుడు వారికి ఉదయం 9గంటల నుంచి 10.30 గంటలలోపు ఆసుపత్రిలో హాజరు కావాలని ఉన్నప్పటికీ ఈ వైద్యుడు నిర్లక్ష్యం వల్ల ప్రతి సారీ సదరం కోసం వచ్చే రోగులను మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తర్వాత వరకు ఈ డాక్టరు చూడడని దీని వల్ల అంగవైకల్యంతో సర్టిఫికెట్ల కోసం వచ్చేవారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ప్రజాశక్తి ముందు రోగులు వాపోయారు. దీనికి తోడు ఈ డాక్టరు ఆసుపత్రిలో మిగతా సమయాలలో ఎంత ఎమర్జెన్సీ రోగులునైనా ముట్టడనే నానుడు ఉంది. ఇక గిరిజన రోగుల పట్ల ఈ డాక్టర్ మరీ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తాడని ఆసుపత్రి సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలువురు రోగులు ఆరోపణలపై ప్రజాశక్తి పరిశీలన చేయగా ఆసుపత్రి పైఅంతస్తులో



డాక్టర్ కోసం చూస్తున్న వికలాంగురాలు



వైద్యుని కోసం ఎదురు చూస్తున్న వికలాంగులు

ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పిచ్చి కుక్క కరిచిన నా కుమారుడుని ఆసుపత్రికి తీసుకువెళ్తే నాకు అక్కడ విషయం మొత్తం అర్థమైంది. ఒపి రాసుకున్న తరువాత డాక్టర్‌ను సంప్రదించగా గాయాలను వెంటనే డెట్టాల్ సబ్బుతో కడిగిన తరువాత రమ్మన్నారు. ఆస్పత్రిలో నీటి కోసం ప్రయత్నించగా ఎక్కడా కొళాయిల నుండి చుక్క నీరు రాలేదు. మోటరు వేసి నీటిని సరఫరా చేయాలని సిబ్బందిని అడిగినా స్పందించలేదు. దీంతో నా కుమారుడుని తిరిగి ఇంటికి తీసుకొచ్చి సబ్బుతో గాయాలు కడిగి మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లాను. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పరిస్థితి ఇంత ఘోరంగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

మానవ హక్కుల న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ

పాత సూపరింటెండెంట్ గదిలో ఈ డాక్టరు కుర్చీలో నిద్రపోతూ కనిపించాడు. రోగులు ఇబ్బంది పడుతున్నారని ప్రశ్నించగా నా పర్మిషన్ లేకుండా రూమ్‌లోకి రావడమే కాకుండా వీడియో చిత్రకరిస్తావా అంటూ విలేకరిని తిరిగి దబాయించడం గమనార్హం.

దీనికి ముందు ఉదయం తొమ్మిది గంటలకు వచ్చిన మానసిక వికలాంగురాలు రెండు కావస్తున్నా వైద్యుడు రాకపోవడంతో డాక్టర్ ఎప్పుడు వస్తాడని కనిపించిన వారందరినీ అడగడం ఎంతోమంది మనసును కలచి వేసింది.

వీడియో తీసే హక్కు ఎవరిచ్చారు?



ప్రభుత్వాస్పత్రిలోకి వచ్చి వీడియో తీసే హక్కు నీకు ఎవరిచ్చారు. వీడియో తీసే ముందు నన్ను అడగాలి కదా? నువ్వు విలేకరివైతే ఎవరికి ఎక్కువ. ఒపి కూడా చూడాలి కదా. రెస్ట్ తీసుకుని తరువాత వస్తాను వెళ్లు అని డాక్టర్ కెవి.మురళీ మోహన్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

ఐదు గంటలు నిరీక్షించాం



ఉదయం 9 గంటలకు అపాయింట్మెంట్ టైం ఇచ్చారని ఆసుపత్రికి వచ్చాం. ఇప్పుడు సమయం మధ్యాహ్నం ఒంటి గంటన్నర అవుతుంది. కానీ ఇప్పటి వరకు డాక్టర్ రాలేదు. వస్తారో రారో తెలియదు. మిగతా డాక్టర్స్ ఎవరినైనా అడిగినా కోపగించుకుంటున్నారు. సుమారు ఐదు గంటలుగా డాక్టర్స్ కోసం వేచి ఉన్నాం.

జెగ్గన్న దొర, జాకేరు గ్రామం, వేపాడ మండలం

టిక్కెట్‌పై బెట్టింగులు

● నేడో రేపో తేలనున్న భవితవ్యం
● ఉత్కంఠ రేపుతున్న ఎస్.కోట టిడిపి అభ్యర్థి ప్రకటన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎక్కడైనా గెలుపు కోసం బెట్టింగులు కాయడం చూశాం. కానీ ఎస్‌కోట నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం కోళ్ల లలిత కుమారి, గొంప కృష్ణ గ్రూపు సభ్యులు బెట్టింగులు కాయడం చర్చనీయాంశమైంది. తమ నాయకునికి టిక్కెట్టు వస్తాదని ఒకరు లేదు తమ నాయకురాలికే టిక్కెట్టు వస్తాదని మరో గ్రూపు నాయకులు లక్షల్లో బెట్టింగులు కాస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు రాజకీయ వారసురాలుగా రాజకీయంలోకి వచ్చి తనదంటూ ముద్ర వేసుకుని రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి టిడిపికి ఎస్ కోటను కంచుకోటగా మార్చిన సీనియర్ నాయకులు కోళ్ల లలిత కుమారికే ఈ సారి కూడా టిక్కెట్టు కేటాయిస్తారని ఆమె గ్రూపు బలమైన నమ్మకంతో బెట్టింగులకు దిగుతున్నారు. మరో పక్క ఈసారి యువకులకు అవకాశం కల్పిస్తున్నామని చంద్రబాబు గతంలోనే ప్రకటించడం, ఈ నేపథ్యంలో టిడిపి అభివృద్ధి కోసం పనిచేస్తున్న తానా ఫౌండేషన్ ప్రతినిధి గొంప కృష్ణను ఇక్కడకు తీసుకురావడంతో ఆయనకే కచ్చితంగా టిక్కెట్టు ఇస్తారని ఆయన గ్రూపు సభ్యులు బెట్టింగులు కాస్తున్నారు. గొంప కృష్ణ కూడా రైతులకు వ్యవసాయ కిట్లు పంపిణీ, విద్యాసంకల్పం పేరుతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ, మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్‌లో శిక్షణ తో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందారు. పార్టీకి నియోజకవర్గంలో ఒక ఊపు తీసుకువచ్చారని ప్రచారం సాగుతోంది. పైగా లలిత కుమారికే టిక్కెట్ ఇవ్వాలనుకుంటే ఇదివరకే ప్రకటించి ఉండాలని ఇప్పటివరకు ప్రకటించలేదంటే ఇక గొంప కృష్ణకే టిడిపి ఉమ్మడి అభ్యర్థి టికెట్ కేటాయిస్తారనే నమ్మకంతో ఆయన గ్రూపు బెట్టింగులకు దిగుతున్నట్లు తెలిస్తోంది. ఏది ఏమైనా ఒకటి రెండు రోజుల్లో ఎస్.కోట టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిని అదిష్టానం ప్రకటించే అవకాశం ఉన్నందున రెండు గ్రూపులకు చెందిన నాయకులతో పాటు నియోజకవర్గం ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

చంద్రబాబు బీసీల పక్షపాతి

ప్రజాశక్తి- రేగిడి, రాజాం

చంద్రబాబు బీసీల పక్షపాతి అని మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. మంగళవారం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని సతీసమేతంగా ఆయన మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం రాజాం మండలంలోని శ్యాంపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో పెనుబాక గ్రామానికి చెందిన 15 బీసీ కుటుంబాలు టిడిపిలో చేరాయి. కోండ్రు మాట్లాడుతూ చంద్రబాబు రూపకల్పన చేసిన మినీ మానిఫెస్టోలో ఉన్న సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ లపై ప్రజలు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.

బంగారం వ్యాపారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- బొబ్బిలి

నాసిరకం బంగారం ఇచ్చిన వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీలక్ష్మి జ్యుయాలర్స్‌లో బంగారం కొనుగోలు చేసి మోసపోయిన వృద్ధురాలు సత్తి జయమణి కోరారు. శ్రీలక్ష్మి జ్యుయాలర్స్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వృద్ధురాలు జయమణి పోలీసు స్టేషన్ ముందు రోడ్డుపై ఏడుస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్‌ల కంట పడింది. వెంటనే ఆమెను పలకరించగా తాను మోసపోయిన విషయాన్ని చెప్పి కన్నీటి పర్యంతమైంది. తాను ఐదు నెలల క్రితం శ్రీలక్ష్మి జ్యుయాలర్స్ షాపులో రూ.40వేలు పెట్టి కెడిఎం బంగారు చెవిదిద్దులు, ముక్కు కమ్ములు కొనుగోలు చేశానని, అవి లూజ్ అవ్వడంతో మార్చడానికి ఇస్తే ఐదు నెలలు తిప్పి నాసిరకం బంగారం ఇచ్చినట్లు ఆమె వాపోయింది. నాసిరకం బంగారాన్ని ఇచ్చిన వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది.

బంగారం అమ్మకాల్లో మోసాలను నివారించండి

బొబ్బిలిలో బంగారం అమ్మకాల్లో మోసాలను నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. మోసపోయిన వృద్ధురాలితో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ



బాధితురాలి నుంచి బంగారం కొనుగోలు బిల్లు తీసుకుంటున్న నాయకులు

బొబ్బిలి పట్టణంలో ఉన్న బంగారం షాపులలో అనేక మోసాలు జరుగుతున్నాయన్నారు. బంగారం షాపు యజమానులు ప్రజలను మోసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కెడిఎం బంగారం అని చెప్పి నాసిరకం బంగారాన్ని అమ్మి మోసం చేస్తున్నారని ఆరోపించారు. బొబ్బిలిలో కొనుగోలు చేసిన బంగారాన్ని తిరిగి అమ్మితే సగం డబ్బులు కూడా రావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం బంగారాన్ని అమ్మి మోసాలు చేస్తున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని జయమణికు న్యాయం చేయాలని లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పౌష్టికాహారం అందించాలి



కొత్తవలస: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో పోషణ పక్వాడపై మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ అరుణకుమారి మాట్లాడుతూ రక్తహీనత నివారించేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల, వియ్యంపేట సెక్టార్ పరిధిలో అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ ఆధ్వర్యంలో స్కూలు పిల్లలతో, అంగన్వాడి కార్యకర్తలతో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమాదేవి మాట్లాడుతూ పోశణ పక్వాడ కార్యక్రమం ఈనెల 23 వరకు జరుగుతుందన్నారు. ప్రతిరోజు పిల్లలు వృద్ధుల వరకు యోగా చేయడం వల్ల మానసిక వికాసం పెంపొందించి తగిన జ్ఞానాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియో డాక్టర్ తిరుపతిరావు, వియ్యం పేట పిహెచ్‌సి సిబ్బంది, ఎసిడిపిఒ బి. లక్ష్మీబాయి, సూపర్వైజర్ కె.వి. స్వర్ణలత, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నమ్మతల్లి పండగ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో వెలసిన చిన్నమ్మ తల్లి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఉప సర్పంచ్, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా పండగను నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారు ఘటాలకు భక్తులు ముడుపులు, మొక్కు బడులు చెల్లించారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనం చేసుకొని ఘటాల వద్ద పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వివిధ వేష దారణలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, భాణా సంచాల కాంతుల మధ్య అమ్మవారి ఘటాలు పురవీధుల్లో ఊరేగించారు. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు. వివిధ స్వచ్ఛంద సంఘాల సభ్యులు యాత్రికలకు తాగునీటి సదుపాయంతో పాటు పులిహోర, అన్నదానం చేశారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 20,21,22 తేదీల్లో న్విహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 20న మధ్యాహ్నం 3 గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, గ్రామ ప్రదక్షణ, హోమం, జలాధివాసం, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 21న గురువారం ఉదయం 9 గంటల నుండి గణపతి పూజ, మండపాలకు పూజ, గణపతి హోమం, క్షీరాదివాసం జరుగుతాయన్నారు. 22న శుక్రవారం ఉదయం 7.45 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ట, యంత్ర స్థాపన, కలశ స్థాపన, పూర్ణహుతి కార్యక్రమాలతో పాటు అన్నదానం చేపడతామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 21న ముగ్గుల పోటీలు, 22న చిన్నపిల్లల, మహిళా కోలాటం, బాలు రైడర్స్ డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం ప్రారంభం

మండలంలోని జాకేరులో మంగళవారం రామాలయ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ పురవీధులలో రామనామ స్మరణతో రాములోరి విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, పాలక మండల సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భజన, కోలాటంతో పాటు బుధవారం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పైడితల్లమ్మకు బంగారు వస్తువులు బహుకరణ



కానుకలతో దంపతులు

భోగాపురం : మండలంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు పల్లి సత్యవతి, సూరినాయుడు దంపతులు 14 గ్రాముల బంగారంతో అమ్మవారికి వస్తువు లను బహూకరించారు. అమ్మవారి 143వ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి ముక్కుకు నత్తుతోపాటు అడ్డుకమ్మని బంగార ంతో చేయించి మంగళవారం అమ్మవారికి సత్యవతి దంపతులు సమర్పించుకున్నారు.

ఓర్వలేక విమర్శలు

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలో వైసిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కోటలో జరిగిన సమావేశంలో తనపై విమర్శలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రాజా మాటల్లో వాస్తవం లేదన్నారు. టిడిపి టికెట్ కోసం తెంటు రాజా ఎంత ప్రయత్నం చేశారో తనకు తెలుసునన్నారు. రాజాకు టికెట్ రాలేదని కోపంతో పక్కి గ్రామస్తులు టిడిపికి వ్యతిరేకంగా ఓటు వేశారు తప్ప తాను చెప్పలేదన్నారు. ఓడిపోయామని కారణంతో తనపై అసహనం వ్యక్తం చేశారని విమర్శించారు. తనను విమర్శించే అర్హత తెంటు రాజాకు లేదన్నారు. టిడిపి హయాంలో ముగడ గ్రామాన్ని అప్పటి కేంద్ర మంత్రి అశోక్ దత్తత తీసుకున్నా అభివృద్ధి చేయలేదన్నారు. వైసిపి హయాంలో ముగడను, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో బిసిలు ఐక్యమత్యంగా ఉండి ఉనికిని చాటి చెప్పాలన్నారు. పోటీ చేసేందుకు బొబ్బిలి రాజులు భయపడేలా బిసిలు ఐక్యంగా ఉండాలన్నారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ ఉన్నారు.


అవగాహనతోనే క్షయవ్యాధి నివారణ

ప్రజాశక్తి - రామభద్రపురం

అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ సాధ్యపడుతుందని ఎంపిడిఒ ఈశ్వరమ్మ తెలిపారు. మండల పరిధిలోని దుప్పలపూడిలో బొబ్బిలి టిబి యూనిట్ సూపర్‌వైజర్ శ్రీదేవితో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ టీబీ వారోత్సవాల్లో భాగంగా ఈ వ్యాధి నియంత్రణ కోసం సదస్సులు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. 2 వారలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలో ఉండే ఆసుపత్రికి వెళ్ళి రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి ప్రమాదకరం కాదని 6 నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే తగ్గుముఖం పడుతుందని అన్నారు. పెద్దవాళ్ళు బీసీజీ ఇంజెక్షన్ ముందుగా వేసుకుంటే వ్యాధి సోకే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరికతోట పిహెచ్‌సి వైద్యాధికారి రత్నదీపక్, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ పొట్టా కిషోర్, ఆశా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి - భోగాపురం



మహిళలతో మాట్లాడుతున్న మాదవి

నియోజకవర్గంలోని తీర ప్రాంత మత్స్యకారుల అభివృద్ధికి జనసేన కట్టుబడి ఉందని జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం గ్రామంలో మంగళవారం సాయంత్రం మత్స్యకారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు అంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి ఎంతో అభిమానమని అన్నారు. వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనేది ఆయన ప్రధాన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎమ్మెల్యేగా మరో ఛాన్స్ ఇస్తే నియోజవర్గాన్ని దోచేస్తారని ఆమె అన్నారు. తనకు ఒక్క ఛాన్స్ ఇస్తే తీర ప్రాంత గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ మైలపల్లి అప్పలకొండ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరగకపోవడంతో జనసేనలో చేరామన్నారు. ఈ సమావేశంలో నాయకులు వరపుల సుధాకర్, మండల కోఆర్డినేటర్ జగదీష్, మహిళలు పాల్గొన్నారు.